MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
GHMC
hmda Growing Global
TS-bPASS
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

Happy 75th Independence Day
# క్రైమ్ THE మిర్రర్ ®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 30-08-2026 | పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్



# 22ఏ భూములు తొలగించకపోతే కలెక్టరేట్ ముట్టడి

- పటాన్‌చెరులో 50 వేల ఎకరాలు, లక్ష ఇళ్లు 22ఏలో పెట్టడం దారుణం
- పేదల కష్టార్జితాన్ని ప్రభుత్వం కబ్జా చేస్తోంది
- ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నారు
- రాత్రికి రాత్రే ఆస్తులను 22ఏలో పెట్టడం అన్యాయం
- వారం రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే కలెక్టరేట్ ముట్టడిస్తాం
- పొంగులేటి కాదు.. ప్రజలను లూటీ చేసే పొంగులూటి
- రేవంత్‌కు సంబంధం లేకపోతే పొంగులేటిని బర్తరఫ్ చేయాలి
- పేదల ఇళ్లను 22ఏ నుంచి బేషరతుగా తొలగించాలి
- ప్రజల ఆస్తులను కాపాడాల్సిన ప్రభుత్వమే భక్షకులుగా మారింది

**22ఏ బాధితుల పక్షాన పోరాటం కొనసాగిస్తాం**



మిగతా 2లో

పటాన్‌చెరు, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి, ఆగస్టు 29: 22ఏ నిషేధిత జాబితాలో చేర్చిన భూములు, ఇళ్లను వారం రోజుల్లో బేషరతుగా తొలగించాలని, లేనిపక్షంలో సంగారెడ్డి కలెక్టరేట్‌ను ముట్టడించి అక్కడే వంటావార్పు కార్యక్రమం చేపడతామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత తన్నీరు హరీశ్‌రావు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం పటాన్‌చెరు జీఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 22ఏ భూముల బాధితుల సమావేశానికి ఆయన హాజరయ్యారు. ముందుగా 22ఏ బాధితులతో హరీశ్‌రావు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పీఎస్ఆర్, సింఫని, చిట్కుల్, సుల్తాన్‌పూర్, పటాన్‌చెరు, సొలక్‌పల్లి తదితర ప్రాంతాలకు చెందిన

## కూకట్ పల్లి నియోజకవర్గానికి 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి అభివృద్ధి చేసిందేమీ లేదు

- కాంగ్రెస్ పార్టీ హయాంలోనే అభివృద్ధి చెందింది... బహిరంగ చర్చకు సిద్ధమా?
- మొదటిసారి కౌన్సిలర్ గా పోటీ చేసినప్పుడు నీ ఆస్తులు ఎంత ప్రస్తుతం మీ ఆస్తుల విలువ ఎంత...?
- నియోజకవర్గంలోని చెరువులను, నాళాలు, కుంటలను కబ్జా చేసి సొమ్ము చేసుకున్నది ఎవరు?
- 22ఏ విషయంలో కృష్ణరావు ఉరి, హత్య, ఆత్మహత్య" అంటూ ప్రజల సానుభూతి కోసం నాటకాలు
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన బండి రమేష



7లో

## శివకేశవుని సన్నిధిలో శ్రావణ శోభ..!!



# 22ఏ భూములు తొలగించకపోతే

# కలెక్టరేట్ ముట్టడి




బాధితులు 22ఏ కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మార్వో, ఆర్ఐ కార్యాలయాల అధికారులు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ తమను తిప్పుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. పటాన్‌చెరు నియోజకవర్గంలోనే దాదాపు లక్ష ఇళ్లు, 50 వేల ఎకరాల భూములను 22ఏ నిషేధిత జాబితాలో చేర్చడం దారుణమన్నారు. దశాబ్దాలుగా నివాసం ఉంటున్న ఇళ్లు, పట్టా భూములను నిషేధిత జాబితాలో చేర్చడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో పిల్లల చదువులు, పెళ్లిళ్లు, బ్యాంకు రుణాలు వంటి అంశాలపై ప్రభావం పడుతోందన్నారు. గుమ్మడిదల, అమీన్‌పూర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు, జిన్నారం మండలాల్లో కలిపి 50,565 ఎకరాలను 22ఏ జాబితాలో చేర్చారని హరీశ్‌రావు ఆరోపించారు. పేదలు, మధ్యతరగతి ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాల్సిన ప్రభుత్వం వారినే ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించిన ఆస్తులు 22ఏ జాబితాలో ఉన్నప్పటికీ వాటిని ఎలా తొలగించారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సామాన్య ప్రజల ఆస్తులను కూడా అదే విధంగా తొలగించాలని కోరారు. 22ఏ సమస్య పరిష్కారంలో రెవెన్యూ మంత్రి విఫలమయ్యారని, ఈ వ్యవహారంతో ముఖ్యమంత్రికి సంబంధం లేకపోతే పొంగులేటిని మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గురించి మంత్రి పొంగులేటి కాదు.. ప్రజలను లూటీ చేసే పొంగులూటి అంటూ హాట్ కామెంట్స్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఆస్తులను కాపాడటంలో విఫలమైందని విమర్శించిన హరీశ్‌రావు.. బీఆర్ఎస్ హయాంలో జీవో 58, 59 కింద పటాన్‌చెరు ప్రాంతంలో వేలాది మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందించామని తెలిపారు. 22ఏ సమస్యను వారం రోజుల్లో పరిష్కరించకపోతే బాధిత రైతులు, ఇళ్ల యజమానులతో కలిసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, స్థానిక నాయకులు, కార్యకర్తలు, 22ఏ బాధిత కుటుంబాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# రక్తస్రావంతో గర్భిణి మృతి.. కేసు నమోదు

పెన్‌పహాడ్, ఆగస్టు 29 : పెన్‌పహాడ్ మండల పరిధిలోని దోసపహడ్ గ్రామానికి చెందిన వలపట్ల జానకమ్మ భర్త వీరయ్య దంపతుల కూతురు నాగమణిని 8 సంవత్సరాల క్రితం మండల పరిధిలోని నాగులపాటి అన్నారం గ్రామానికి చెందిన మీసాల నాగరాజు ఇచ్చి వివాహం చేశారు. వారికి 8 సంవత్సరాల తర్వాత నాగమణికి గర్భం అందింది. కాగా మీసాల నాగమణి (25) గురువారం రాత్రి ప్రసవ నొప్పులతో పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చేరింది. శుక్రవారం ఉదయం నొప్పులు అధికం కావడంతో నర్సింగ్ అధికారులు స్వర్ణలత, వినోద్ ఆధ్వర్యంలో ప్రసవం నిర్వహించారు. నాగమణి ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లీబిడ్డ తొలుత ఆరోగ్యంగానే ఉన్నట్లు సమాచారం. అయితే ప్రసవం అనంతరం గర్భాశయంలోని మాయ (ప్లాసెంటా) తొలగించడంలో ఇబ్బంది ఏర్పడింది. మాయను తొలగించేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో విషయాన్ని జిల్లా ప్రోగ్రాం అధికారికి సమాచారం అందించి నాగమణిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమెకు అధిక రక్తస్రావం జరిగినట్లు తెలిసింది. జనరల్ ఆసుపత్రిలో వైద్యులు మాయను తొలగించి చికిత్స అందించారు. ఐసీయూలో చికిత్స పొందుతూ.. శుక్రవారం సాయంత్రం 5.30 గంటల సమయంలో నాగమణి రక్తపోటు ఒక్కసారిగా పడిపోవడంతో పాటు హార్ట్ బీట్ లో వ్యత్యాసం ఏర్పడింది. దీంతో ఆమెను ఐసీయూకు తరలించి అత్యవసర చికిత్స అందించినప్పటికీ శుక్రవారం రాత్రి మృతి చెందినట్లు హాస్పటల్ సిబ్బంది తెలిపారు. మృతురాలి తల్లి వలపట్ల జానకమ్మ శనివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు మృతికి కారకులైన ఈ.స్వర్ణలత ఏ ఎం.వినోద్ జిన్సి డాక్టర్ రాజేష్ పై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలు నాయక్ తెలిపారు.

# తుంగతుర్తిలో పందుల స్వైర విహారం

తుంగతుర్తి, ఆగస్టు 29 : సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల కేంద్రంలో గత కొన్ని సంవత్సరాలుగా పందుల పెంపకం దారులు ఎస్సీ కాలనీలోని ఇండ్ల మధ్యలో పందుల గూడు ఏర్పాటు చేసి ఇష్టారాజ్యాంగా పెంచుతున్నారు. శు క్రవారం రాత్రి 8 గంటల సమయంలో బొంకూరి సాయి కుమార్ అనే యువకుడు బైక్‌పై పెద్ద చెరువు దగ్గరికి వెళ్లి వస్తుండగా ఒకసారిగా రెండు పందులు వచ్చి బండికి తగలడంతో కిందపడి తీవ్ర గాయాల పాలయ్యాడు. వెంట ఉన్న స్నేహితుడు చికిత్స కోసం తుంగతుర్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తీసుకువెళ్లి చికిత్స చేయించాడు. పందులు ఇండ్ల మధ్యలో సంచరిస్తుంటే చిన్నపిల్లలు అనారోగ్య బారిన పడుతున్నారని, అదేవిధంగా పంట పొలాలను ఖరాబు చేస్తున్నాయని గ్రామ ప్రజలు వాపోతున్నారు. పందుల నివారణకు పలుమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడం లేదని, పందుల ద్వారా గ్రామ ప్రజలు ప్రాణాలకే ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి సకాలంలో పందుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరారు.

# విష్ణు ఉన్నత పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవ వేడుకలు




**నర్సాపూర్, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి ఆగస్టు 29:** ప్రముఖ భారత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం ఆగస్టు 29న నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవాన్ని విష్ణు ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో పాఠశాలలో వారం రోజులుగా వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. అలాగే విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేలా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పి. నాగజ్యోతి మాట్లాడుతూ విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో అవసరమని, ప్రతి విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ ఆసక్తి చూపాలని సూచించారు. వివిధ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేష్, రమేష్‌తో పాటు ఇతర ఉపాధ్యాయుల సహకారంతో కార్యక్రమం విజయవంతం కావడంపై పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది.

## మృతుల కుటుంబాలకు బీఆర్ఎస్ నేతల భరోసా

**రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేత**

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన కాశమోని జంగయ్య, దేరంగుల రాములు కుటుంబాలను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించి భరోసా కల్పించారు. సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా, కడ్తాల్ మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కంబాల పరమేష్ తదితరులు మృతుల కుటుంబాలను కలిసి వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని నాయకులు హామీ ఇచ్చారు. గంప వెంకటేష్ గుప్తా ఇరువురు కుటుంబాలకు రూ.5 వేల చొప్పున మొత్తం రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మ రెడ్డి రూ.5 వేల చొప్పున మరో రూ.10 వేల సహాయం అందించారు. దీంతో ఇరువురు కుటుంబాలకు కలిపి మొత్తం రూ.20 వేల ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, బాధిత కుటుంబాలు అధైర్యపడవద్దని తెలిపారు. పదవులు ఉన్నా లేకున్నా ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ రామకృష్ణ, మంగలపల్లి నర్సింహ, లయక్ అలీ, కేశని బుచ్చయ్య, గురిగళ్ల రామచంద్రయ్య, మూఢ బాలరాజ్, మూఢ అశోక్, కేశని మహేష్, బోసు వెంకటేష్, సిద్దిగారి వెంకటేష్, అంజి కంబలపల్లి, రమేష్, రాయికంటి సురేష్, రాజు, రాఘవ, శ్రీకాంత్, సాయి తదితరులు పాల్గొన్నారు.



# బోనాల ఊరేగింపుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**ఎస్సై కురుమూర్తి**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి:** బోనాల పండుగ సందర్భంగా నిర్వహించే ఊరేగింపుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు హెచ్చరికలు జారీ చేశారు. గత ఏడాది బోనాల పండుగ సందర్భంగా ఊరేగింపులో డీజేలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు కలిగించడంతో పాటు పోలీసు సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన కొందరిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఎస్సై కురుమూర్తి హెచ్చరించారు. అనంతరం వారు మళ్లీ ఎలాంటి గొడవలకు పాల్పడకుండా తహసీల్దార్ సమక్షంలో ఒక్కొక్కరిపై రూ.లక్ష చొప్పున బైండ్‌ఓవర్ చేసినట్లు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది బోనాల ఊరేగింపుల నిర్వాహకులు పోలీసుల సూచనలు, నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్సై స్పష్టం చేశారు. ఊరేగింపుల్లో డీజేలు అనుమతి లేదని ఎవరైనా డీజే ఉపయోగిస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు నిర్వాహకులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నిర్వాహకులు తమ తమ ప్రాంతాల్లో నిర్వహించే బోనాల ఊరేగింపులను ప్రశాంత వాతావరణంలో రాత్రి 8 గంటలలోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఊరేగింపు సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా అందుకు నిర్వాహకులదే పూర్తి బాధ్యత ఉంటుందని పోలీసులు స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై కురుమూర్తి కోరారు.

# అంబట్‌పల్లిలో కాంగ్రెస్ పార్టీకి కొత్త సారథి..!!


**అంబట్‌పల్లి కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడిగా పట్టి రాజబాబు**

**నూతన అధ్యక్షుడికి అభినందనలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు**

**కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి: నాయకులు**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం అంబట్‌పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ నూతన అధ్యక్షుడిగా పట్టి రాజబాబును ఎంపిక చేశారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, టీపీసీసీ అధ్యక్షులు దుద్దిళ్ల శ్రీనుబాబు ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కటకం అశోక్ ఆధ్వర్యంలో గ్రామశాఖ అధ్యక్షుడి ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంబట్‌పల్లి మాజీ సర్పంచ్ ఎరవెల్లి విలాస్‌రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గోనె వసంత్‌రావు, నారం రాంబాబు, పత్తి అశోక్ తదితరులు హాజరై పత్తి రాజబాబును గ్రామశాఖ అధ్యక్షుడిగా ఎంపిక చేశారు. గ్రామంలో పార్టీని మరింత బలోపేతం చేయడం, కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం వంటి అంశాలపై నాయకులు సూచనలు చేశారు. అనంతరం నూతన గ్రామశాఖ అధ్యక్షుడిగా ఎంపికైన పట్టి రాజబాబుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో గ్రామశాఖ అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలను కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పట్టి రాజబాబు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో పార్టీని మరింత పటిష్టం చేసేందుకు కార్యకర్తలు సమష్టిగా పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శివకేశవుని సన్నిధిలో శ్రావణ శోభ..!!

**భక్తిశ్రద్ధలతో శివకేశవ స్వామికి ప్రత్యేక పూజలు**

**ఆంజనేయ స్వామికి చందనం..ఆకుపూజలు**

**పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల వితరణ**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం సూరారం గ్రామంలోని శ్రీ హనుమాన్ శ్రీ శివకేశవ స్వామి దేవాలయంలో శ్రావణమాసం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు వంగళ సత్యనారాయణ చార్యుల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృత అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆంజనేయ స్వామివారికి చందనం, ఆకుపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, ఆకులతో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలు పూర్తయిన అనంతరం అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు. శ్రావణమాసం సందర్భంగా ఆలయంలో నెలరోజుల పాటు స్వామివారికి విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తున్నారు. శ్రావణమాసం అత్యంత పవిత్రమైన మాసం కావడంతో సూరారం పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ కుటుంబాలకు సుఖశాంతులు, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నారు.

# లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం : ఎస్ఐ సాంబమూర్తి

**- పెండింగ్ కేసుల పరిష్కారానికి లోక్ అదాలత్**

**- త్వరిత న్యాయ పరిష్కారానికి లోక్ అదాలత్**



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** భూపాలపల్లి కోర్టు ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబర్ 12వ తేదీ వరకు లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మహాదేవపూర్ ఎస్ఐ ఎం. సాంబమూర్తి తెలిపారు. మహాదేవపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు రాజీకి అవకాశం ఉన్న కేసులను లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాల పరస్పర అంగీకారంతో రాజీ చేసుకునే అవకాశం ఉన్న కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా కేసుల పరిష్కారానికి పట్టే సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన లేదా కోర్టులో పెండింగ్‌లో ఉన్న రాజీకి అవకాశం ఉన్న కేసుల విషయంలో సంబంధిత వ్యక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎస్ఐ సూచించారు. న్యాయపరమైన ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు ప్రజలకు త్వరిత న్యాయం అందించడమే లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. భూపాలపల్లి కోర్టు ప్రాంగణంలో ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 12 వరకు లోక్ అదాలత్ కార్యక్రమం కొనసాగుతుందని, సంబంధిత కేసుల పరిష్కారం కోసం ప్రజలు ముందుకు రావాలని ఎస్ఐ ఎం. సాంబమూర్తి కోరారు.

# డీసీసీ అధ్యక్షుడి ఎంపికకు క్షేత్రస్థాయి అభిప్రాయాల సేకరణ

**సంఘటన్ సృజన్ అభియాన్‌లో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గ స్థాయి సమావేశం**



**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి (కడ్తాల్):** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) నూతన అధ్యక్షుడి ఎంపిక ప్రక్రియలో భాగంగా ఏఐసీసీ సూచనల మేరకు సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను సేకరిస్తున్నట్లు కర్ణాటక ఎమ్మెల్సీ, ఏఐసీసీ కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా అబ్జర్వర్ పి.వి. మోహన్ తెలిపారు. రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొనగా కడ్తాల్‌లోని ఎస్ఎల్ఆర్ గార్డెన్‌లో శనివారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సంస్థాగత సంప్రదింపుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పి.వి. మోహన్ మాట్లాడుతూ.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వం, ఆలోచనలు, మార్గదర్శకత్వంలో కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే సంఘటన్ సృజన్ అభియాన్ ప్రధాన లక్ష్యమని అన్నారు. “కామ్‌దార్ -- నైతికత -- లక్ష్యం -- వ్యూహం” అనే స్ఫూర్తితో పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని పటిష్టం చేస్తూ ప్రజలకు చేరువైన సమర్థవంతమైన నాయకత్వాన్ని తీర్చిదిద్దాలని పేర్కొన్నారు. పార్టీ కోసం నిరంతరం పనిచేసే నాయకత్వం, ప్రజాసేవలో నైతికత, కాంగ్రెస్ సిద్ధాంతాలపై స్పష్టమైన అవగాహన, ఎన్నికలు మరియు సంస్థాగత నిర్మాణంపై సమర్థవంతమైన వ్యూహం కలిగిన నాయకత్వం ద్వారానే పార్టీ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, అందరినీ కలుపుకుని ముందుకు సాగడమే కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలని పి.వి. మోహన్ వివరించారు. బూత్ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసి, ప్రజలతో నిరంతరం అనుసంధానమై ఉండే సంస్థాగత నిర్మాణాన్ని ఏర్పాటు చేయడమే ూూూ ఉద్దేశమన్నారు. డీసీసీ నూతన అధ్యక్షుడి ఎంపికలో క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలకు పూర్తి ప్రాధాన్యత ఇస్తామని ఆయన తెలిపారు. పార్టీని సమర్థవంతంగా ముందుకు నడిపిస్తూ, అందరినీ కలుపుకుని పనిచేసే, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉండే నాయకత్వాన్ని పారదర్శక విధానంలో ఎంపిక చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఇ.వి. శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు. డీసీసీ అధ్యక్ష పదవి కోసం పోటీలో ఉన్న అభ్యర్థులు సమావేశానికి హాజరై పార్టీ అభివృద్ధికి సంబంధించిన తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేశారు. సమావేశంలో ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షులు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి యాచారం వెంకటేశ్వర్లు గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు, డీసీసీ ప్రధాన కార్యదర్శులు చేగూరి వెంకటేష్, రఘురాములు, డీసీసీ కార్యదర్శి రమణారెడ్డి, ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ సత్యనాయక్, పీఏసీఎస్ చైర్మన్ గట్ల కేశవరెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు బట్టు కిషన్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, పోతుగంటి శంకర్, కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్ టౌన్ అధ్యక్షులు అవ్వారి శివలింగం తదితరులు పాల్గొన్నారు. అలాగే బిచ్చ్య నాయక్, మండ్లి రాములు, గురిగల్ల లక్ష్మయ్య, సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి దశరథం, కడ్తాల్ సర్పంచ్ బిక్షపతి, డీసీసీ నాయకులు అంజయ్య గుప్తా, నేనావత్ భీక్య నాయక్, లక్‌పతి నాయక్, రావిచ్చాడు మహేందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, కృష్ణనాయక్, హన్మనాయక్, పర్వతాలు, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవికాంత్ గౌడ్, తాలూకా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు దళపతి గౌడ్, సర్పంచులు మహేందర్ గౌడ్, ప్రేమ జవహర్‌లాల్, కర్ణాకర్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ మండలాల కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్, ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# చిట్యాలలో కృష్ణాష్టమి, బోనాల పండుగలకు తేదీలు ఖరారు



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల పురపాలక సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ పందిరి గీత రమేష్, దౌలతాబాద్ వాసు పంతులు ఆధ్వర్యంలో శనివారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సెప్టెంబర్ 4న శ్రీకృష్ణాష్టమి (ఉట్ల పండగ), సెప్టెంబర్ 6న గ్రామ దేవతలకు ఊరందరి బోనాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అఖిలపక్ష సభ్యులు, కౌన్సిల్ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# టీఎంయూఎస్ నకిరేకల్ అధ్యక్షుడిగా ప్రశాంత్ గౌడ్



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** నకిరేకల్: తెలంగాణ రాష్ట్ర మలిదశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం టీఎంయూఎస్ నకిరేకల్ నియోజకవర్గం అధ్యక్షుడిగా చిట్యాల మండలం ఎలికట్టే గ్రామానికి చెందిన ఉయ్యాల ప్రశాంత్ గౌడ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూనూరు సంజయ్ దాస్ గౌడ్ ప్రకటించారు. తెలంగాణ ఉద్యమంలో ప్రశాంత్ గౌడ్ చురుకైన పాత్ర పోషించారని, ఉద్యమకారుల సంక్షేమం కోసం పనిచేయాలని సంజయ్ దాస్ గౌడ్ ఆకాంక్షించారు.

# డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా యువతలో చైతన్యం అభినందనీయం

**-- డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్**

**-- వేలిమినేడులో ఇమ్రాన్ ప్రిన్స్ బృందానికి డివైఎఫ్ఐ అభినందనలు**

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** ‘సే నో టు డ్రగ్స్ -- సే నో టు గంజాయి’ నినాదంతో యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచేందుకు సికింద్రాబాద్ నుంచి వైజాగ్ వరకు పాదయాత్ర నిర్వహిస్తున్న సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఇమ్రాన్ ప్రిన్స్ మరియు ఆయన బృందాన్ని డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ తరఫున అభినందించారు. చిట్యాల మండలం వేలిమినేడు గ్రామం జాతీయ రహదారి వద్ద వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లం మహేష్ మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు ఆకర్షితులు కాకుండా చైతన్యం కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. యువతను క్రీడలు, విద్య, ఉపాధి, సామాజిక కార్యక్రమాల వైపు నడిపించేందుకు అవగాహన కార్యక్రమాలు అవసరమన్నారు. డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇప్పటికే సైకిల్ యాత్రలు, అవగాహన సదస్సులు, క్రీడా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. యువత ఆరోగ్యకరమైన జీవన విధానం వైపు నడిచేలా కార్యక్రమాలు కొనసాగిస్తామని అన్నారు. అదేవిధంగా డ్రగ్స్, గంజాయికి వ్యతిరేకంగా రూపొందించిన ‘గ్యాంగ్స్ ఆఫ్ సికింద్రాబాద్’ సినిమా అభినందనీయమని, దసరా సందర్భంగా విడుదల కానున్న ఈ చిత్రం ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి కూనూరు గణేష్, గ్రామ శాఖ అధ్యక్షులు మేడి మనోజ్, కూరాకుల శివశంకర్, నాయకులు నూతనకంటి లింగస్వామి, దండు వివేక్, శివ తదితరులు పాల్గొన్నారు.







## గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని గ్రీన్ గ్రోవ్ పాఠశాలలో శనివారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్ జూలకంటి వేణుగోపాల్ రెడ్డి మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని, క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఏవో పోల గోవర్ధన్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


## సీఎంసీ పరిధిలో అక్రమ నిర్మాణాలపై కొనసాగుతున్న కూల్చివేతలు.

**క్రైమ్ మిర్రర్ సైబరాబాద్ :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో అక్రమ నిర్మాణాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ కొనసాగుతోంది. శనివారం సీఎంసీ బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి 26 అనధికార నిర్మాణాలను గుర్తించాయి. అందులో 19 నిర్మాణాలను కూల్చివేయగా, 12 నోటీసులులి జారీ చేశారు. మిగిలిన 7 నిర్మాణాలపై నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టనున్నారు. జోన్ల వారీగా కూల్చివేతలు: శేరిలింగంపల్లి జోన్ లో 9కూకట్‌పల్లి జోన్ లో నాలుగు కుత్బుల్లాపూర్ జోన్ లో ఆరు భవన నిర్మాణ నిబంధనల అమలుకు అన్ని అక్రమ నిర్మాణాలపై చర్యలు తప్పవని సీఎంసీ స్పష్టం చేసింది.





## జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన యువ శౌర్య సేన






**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** విశ్వవిఖ్యాత హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని శంకర్‌పల్లి మోడల్ స్కూల్ అండ్ కాలేజీలో యువ శౌర్య సేన ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువ శౌర్య సేన వ్యవస్థాపక అధ్యక్షుడు రవీందర్ లంటు యాదవ్ మాట్లాడుతూ.. క్రీడలు శారీరక, మానసిక ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని అన్నారు. క్రీడలతో కండరాలు, ఎముకలు బలపడటంతో పాటు శరీర బరువు నియంత్రణలో ఉంటుందని తెలిపారు. రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు మానసిక ఆందోళన తగ్గి ఆత్మవిశ్వాసం పెరుగుతుందని పేర్కొన్నారు. నిరంతర సాధనతోనే క్రీడల్లో రాణించగలమని, ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ కనీసం ఒక గంట ఆటలు ఆడాలని సూచించారు. క్రీడల ద్వారా నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, సమయపాలన, నియమాలను గౌరవించే తత్వం అలవడుతుందని అన్నారు. అలాగే ఇతరులతో కలిసి పనిచేసే సామర్థ్యం, జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరగడంతో పాటు గెలుపోటములను సమానంగా స్వీకరించే ధైర్యం పెరుగుతుందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, యువ శౌర్య సేన సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సనాతన సంగీతాన్ని దైవంగా భావించిన శ్రవ్య, శ్రావణీలు

### నేటి యువతరం వారిని ఆదర్శంగా తీసుకోవాలి: ఆర్. నరేష్ కుమార్



**క్రైమ్ మిర్రర్ -- శంకర్‌పల్లి:** సనాతన సంగీతాన్ని, ధర్మాన్ని దైవంగా భావించి భక్తి గీతాలు ఆలపించడమే కాకుండా, ఇతరులకు శిక్షణ ఇస్తూ సంగీతాన్ని ప్రోత్సహిస్తున్న శ్రవ్య, శ్రావణీలను నేటి యువతరం ఆదర్శంగా తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ తెలంగాణ ఎండోమెంట్ ధార్మిక సెల్ రంగారెడ్డి జిల్లా రూరల్ జాయింట్ కన్వీనర్, సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు ఆర్. నరేష్ కుమార్ (సతీష్ కుమార్) పిలుపునిచ్చారు. రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం గుబ్బడి పత్తేపురంలోని శ్రీ రాధాకృష్ణ ఆలయ క్షేత్రంలోని సనాతన కృష్ణగిరి పాదాల గుట్ట సన్నిధిలో గాన కచేరీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రవ్య, శ్రావణీలు ఆలపించిన భక్తి గీతాలు భక్తులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. ఈ సందర్భంగా నరేష్ కుమార్ మాట్లాడుతూ.. సనాతన భారతీయ సంస్కృతి గొప్పతనం పట్ల శ్రవ్య, శ్రావణీలకు ఉన్న అంకితభావం అభినందనీయమని అన్నారు. పురాతన, సనాతన కళలు అంతరించిపోతున్న తరుణంలో వాటిని కాపాడేందుకు వారు చూపుతున్న శ్రద్ధ, భక్తిని జాతీయ సంపదగా గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బు, పేరు కోసం మాత్రమే కొందరు సంగీతాన్ని ప్రదర్శిస్తుంటే.. శ్రవ్య, శ్రావణీలు మాత్రం తెలుగు భాష, సంస్కృతి అభివృద్ధి కోసం ఆలయాల వద్ద ఉచితంగా భక్తి గీతాలు ఆలపించడం అభినందనీయమని కొనియాడారు. పిల్లల అభిరుచిని అర్థం చేసుకుని వారిని ప్రోత్సహిస్తున్న తండ్రి నారాయణను కూడా ఆయన అభినందించారు. అనంతరం నరేష్ కుమార్.. నారాయణ, శ్రవ్య, శ్రావణీలను శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా నారాయణ, శ్రవ్య, శ్రావణీలు మాట్లాడుతూ.. తాము ఎన్నో గాన కచేరీలు నిర్వహించినప్పటికీ నరేష్ కుమార్ వంటి దైవభక్తి, దేశభక్తి కలిగిన వ్యక్తిని ఇక్కడే చూస్తున్నామని అన్నారు. కృష్ణగిరి పాదాల గుట్ట ప్రకృతి రమణీయతతో పాటు మహిమ కలిగిన క్షేత్రమని, ఈ క్షేత్ర అభివృద్ధికి తమ సహకారం ఎప్పటికీ ఉంటుందని తెలిపారు. అంతకుముందు కృష్ణగిరి పాదాల గుట్ట చుట్టూ భక్తులు గిరి ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం అన్నప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. అన్నప్రసాద దాతలు జంగయ్య దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సమతా స్కూల్ కరస్పాండెంట్ దావల్ రెడ్డి, శ్రీశ్రీ భ్రమరాంబిక మల్లికార్జున ఆశ్రమ ధర్మకర్త ఎ. నర్సింహాగౌడ్, గ్రామ పెద్దలు ఆర్. రాంలక్ష్మయ్య, భూపతి రెడ్డి, జంగయ్య ముదిరాజ్, ఆర్. జంగయ్య, రాములు గౌడ్, ఆర్. రాజు, శ్రీశైలం గౌడ్, వెంకటేశ్ గౌడ్, హరీష్, సుధాకర్, శ్రీనివాస్, పూజారి ఆదిత్య, చరణ్‌తో పాటు మహిళలు, భక్తులు, గ్రామస్తులు

## గోబర్ గ్యాస్ గుంతలో పడి రెండేళ్ల బాలుడు మృతి



**చిట్యాల క్రైమ్ మిర్రర్:** పండుగకు బంధువుల ఇంటికి వచ్చిన రెండేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు గోబర్ గ్యాస్ కోసం ఏర్పాటు చేసిన గుంతలో పడి మృతి చెందిన ఘటన చిట్యాల మండలం ఏపూర్ గ్రామంలోని డీఈసీ కంపెనీలో చోటుచేసుకుంది. బీహార్‌కు చెందిన అజయ్ పండిట్ కుమారుడు ఆర్యన్ కుమార్ (2) తన తల్లిదండ్రులతో కలిసి రెండు రోజుల క్రితం ఏపూర్‌లోని డీఈసీ కంపెనీలో పనిచేస్తున్న మామయ్య ఇంటికి రాఖీ పండుగ సందర్భంగా వచ్చాడు. శు క్రవారం ఉదయం సుమారు 9 గంటలకు క్వార్టర్స్ పక్కన ఆడుకునేందుకు ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. మధ్యాహ్నం అయినా బాలుడు తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. కంపెనీలోని సీసీ కెమెరాలను పరిశీలించగా బాలుడు కంపెనీ ఆవరణలో గోబర్ గ్యాస్ కోసం ఏర్పాటు చేసిన గుంతలో ప్రమాదవశాత్తు పడిపోయినట్లు గుర్తించారు. గుంతలో ఊపిరాడక బాలుడు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి అజయ్ పండిట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి. వెంకట్ రెడ్డి తెలిపారు.




# ఎస్ఐఆర్ ప్రత్యేక సవరణపై నోటీసుల విచారణ

**క్రైమ్ మిర్రర్ శంకర్ పల్లి:** శంకర్‌పల్లి మండల పరిధిలోని పోలింగ్ స్టేషన్లు 80, 81, 82కు సంబంధించి ఎస్ఐఆర్ ప్రత్యేక సవరణలో భాగంగా సంబంధిత ముఖ్యులకు జారీ చేసిన నోటీసులపై విచారణ నిర్వహించారు. విచారణ సందర్భంగా ఓటర్ల జాబితాలో తొలగింపునకు సంబంధించిన అభ్యంతరాలు, తప్పులు ఏమైనా ఉన్నట్లయితే సంబంధిత వ్యక్తులు ఆధారాలు సమర్పించాలని సూచించారు. ఆధారాలను పరిశీలించిన అనంతరం అర్హత ఉన్న వారి పేర్లను తిరిగి ఓటర్ల జాబితాలో నమోదు చేయాలని సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత బీఎల్ఓలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. వి. ప్రవీణ్ కుమార్ ఎంపీడీవో, శంకర్‌పల్లి.

# శిల్పారామంలో అంగరంగ వైభవంగా 'శ్రీకృష్ణ నర్తనం'....



**క్రైమ్ మిర్రర్ మాదాపూర్ :** శిల్పారామంలో శనివారం 'శ్రీకృష్ణ నర్తనం' పేరిట నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన అంగరంగ వైభవంగా జరిగింది. సిరి ఆర్ట్స్ ఇన్‌స్టిట్యూట్ మరియు సత్య కృష్ణ కూచిపూడి కళా నిలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.చిన్నారులు ప్రదర్శించిన నృత్య రూపకాలు ప్రేక్షకులను ఎంతగానో అలరించాయి. శ్రీకృష్ణుని జన్మ ఘట్టం నుంచి చెరసాలలో జననం, గోవర్ధనగిరి ఎత్తడం, కంస వధ వరకు పలు పౌరాణిక ఘట్టాలను కళ్ళకు కట్టినట్లు అభినయించారు. చిన్నారుల హావభావాలు, అభినయం ఆహుతులను మంత్రముగ్ధులను చేశాయి.కార్యక్రమంలో ప్రతిభ కనబరిచిన బాల కళాకారులను రష్యన్ కల్చరల్ సెంటర్ డైరెక్టర్ అలెగ్జా దంపతులు మరియు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త శ్రీ తంగిరాల పురుషోత్తం ఘనంగా సత్కరించారు. చిన్నారుల కళా ప్రతిభను, వారిని తీర్చిదిద్దిన గురువుల కృషిని వారు కొనియాడారు. శిల్పారామానికి విచ్చేసిన పర్యాటకులు, కళాభిమానులు ఈ ప్రదర్శనను తిలకించి చిన్నారుల ప్రతిభను ప్రశంసించారు.

# శ్రీ స్వరసిద్ధి వేంకటేశ్వరునికి శ్రీదేవి నాట్యాలయ కూచిపూడి

**భరతనాట్య నృత్యార్చన**



**క్రైమ్ మిర్రర్ మాదాపూర్:** పద్మశ్రీ డా. శోభారాజు ఆధ్వర్యంలో ప్రతి శనివారం నిర్వహించే అన్నదానం -- అన్నమ స్వరార్చనలో భాగంగా శనివారం శ్రీదేవి నాట్యాలయ విద్యార్థులచే కూచిపూడి, భరతనాట్య నృత్యార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గురువు శ్రీదేవి అరుణ్ కుమార్ మార్గదర్శకత్వంలో శిష్యులు సంవిత, అక్షయ, మోక్ష, హాసిని తదితరులు కృష్ణం కలయ సఖి, కల్యాణ రామ, గరుడ గమన, నారాయణతే"లి వంటి అన్నమయ్య సంకీర్తనలకు నృత్య కైంకర్యం సమర్పించి భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం డా. శోభారాజు, మేనేజింగ్ డైరెక్టర్ డా. నందకుమార్ కళాకారులను అభినందించి స్వామివారి ప్రతిమను బహుకరించారు. మంగళహారతి, ప్రసాద వితరణతో కార్యక్రమం ముగిసింది.

# ఘనంగా పిజెఆర్ స్టేడియంలో క్రీడదినోత్సవ వేడుకలు.



**క్రైమ్ మిర్రర్ చందా నగర్:** చందానగర్ పిజెఆర్ స్టేడియంలో రాష్ట్ర హాకీ సంఘం ఆధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హాకీ దిగ్గజం మేజర్ జ్ఞాన్ చంద్ చిత్రపటానికి పలువురు క్రీడ కోచ్ లు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశ క్రీడల్లో తనదైన ముద్ర వేసి తన హాకీ స్టిక్ ద్వారా ప్రపంచ పటంలో మన దేశానికి గుర్తింపు తీసుకువచ్చిన జ్ఞాన్ చంద్ జయంతి రోజున క్రీడ దినోత్సవం నిర్వహించుకోవడం ప్రతి క్రీడాకారునికి గర్వకారణం అని తెలిపారు. స్టేడియంలో వివిధ క్రీడల కోచ్ లను హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్టేడియం అడ్మిన్ వీరానంద్ , కోచ్ లు కెన్నెడీ, రవీందర్, వెంకట్ గౌడ్ ,, లక్ష్మణ్, రవి, శ్రీకాంత్, మహేష్ నవీన్, ప్రమోద్ , కోవెల తదితరులు పాల్గొన్నారు.

# నూతన డివిజన్ అధ్యక్షుడికి ఘనంగా సన్మానం.



**క్రైమ్ మిర్రర్ మియాపూర్:** మక్త మహబూబ్‌పేట్ 241వ డివిజన్‌కు నూతన అధ్యక్షుడిగా జాజి రావు శ్రీనివాస్ నియమితులైన సందర్భంగా మసీద్‌బండ బీజేపీ కార్యాలయంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్యే అభ్యర్థి మారబోయిన రవికుమార్ యాదవ్ నూతన డివిజన్ అధ్యక్షుడు జాజి రావు శ్రీనివాస్ ని శాలువాతో సన్మానించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ.. 241వ డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలని నూతన అధ్యక్షుడిని కోరారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేసి, డివిజన్‌లో బీజేపీని మరింత బలోపేతం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ కౌన్సిల్ మెంబర్ గుండె గణేష్ ముదిరాజ్ , రాజేష్ గౌడ్ , శివారెడ్డి , కుమారస్వామి , కొంచె బాబు, రామకృష్ణ , రాము నవీన్ , శ్రీధర్ , తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ హామీల విఫలంపై క్షేత్రస్థాయిలో ఎండగడతాం : బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** కాంగ్రెస్ ఎన్నికల్లో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోకుండా ప్రజలకు బాకీ పడిందని, ఆ బాకీలను ఎప్పుడు తీరుస్తారో చెప్పాలని డిమాండ్ చేస్తూ, 'బాకీ కార్డు' పేరుతో గ్రామ గ్రామాన కాంగ్రెస్ పార్టీని నిలదీయాలని బడంగ్ పేట్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు, మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు సెప్టెంబర్ 2వ తేదీ నుంచి వారం రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. 100 రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసగించిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రతి వర్గానికి వివరించేలా పార్టీ శ్రేణులంతా ఏకతాటిపైకి వచ్చి నిరసనల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులైనా ఒక్క హామీని కూడా సంపూర్ణంగా నెరవేర్చలేదని, కాంగ్రెస్ తీరును క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరిస్తూ ఎండగడతామని బోయపల్లి దీపికా శేఖర్ రెడ్డి స్పష్టం చేశారు.

# నేడు మునుగోడులో విద్యుత్ సరఫరా కు అంతరాయం



**మునుగోడు క్రైమ్ మిర్రర్:** 33/11 కేవీ మునుగోడు సబ్‌స్టేషన్ పరిధిలో లైన్ స్ట్రింగింగ్ పనుల కారణంగా ఆదివారం ఉదయం 10గంటల 30 నిమిషాల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మునుగోడు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుంది అని ఏఈ నరేందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.



## కడ్తాల్ బోనాల ఉత్సవాలకు జైపాల్ యాదవ్‌కు ఆహ్వానం

**క్రైమ్ మిర్రర్ కల్వకుర్తి(కడ్తాల్):** కడ్తాల్ గ్రామంలో సెప్టెంబర్ 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు నిర్వహించనున్న బోనాల ఉత్సవాలకు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ అధ్యక్షులు గొల్ల సత్యం యాదవ్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు చేగురి రాములు, మల్లేష్ గౌడ్‌లు జైపాల్ యాదవ్‌ను శాలువాలతో సత్కరించి, బోనాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. నాలుగు రోజుల పాటు కడ్తాల్ గ్రామంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 5న కాటమయ్య బోనాలు, 6న పెద్దమ్మ, మడేలు మాందాత బోనాలు, 7న గ్రామ దేవత పోచమ్మ బోనాలు, 8న రేణుక ఎల్లమ్మ బోనాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గంపా వెంకటేష్ గుప్తా, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ రామకృష్ణ, గంపా శ్రీనివాస్ గుప్తా, మూఢ అశోక్ కుమార్, ఆంజనేయులు, జగన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్నదాన మహోత్సవం....

**క్రైమ్ మిర్రర్ చందానగర్:** మానవ సేవే మాధవ సేవ అనే నినాదంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం గంగారంలో భారీ అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చందానగర్ – గంగారం ప్రధాన రహదారిలోని ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 3600 మందికి పైగా నిరుపేదలు, వృద్ధులు, వితంతువులు, భవన నిర్మాణ కార్మికులు, ఆటో డ్రైవర్లకు కడుపునిండా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మాట్లాడుతూ.. ఆకలితో ఎవరూ ఉండకూడదనే లక్ష్యంతో గత కొన్నేళ్లుగా గంగారం పరిసర ప్రాంతాల్లో నిరంతరం అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు హాజరై ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణంపై ఆగ్రహం

**కబ్జాదారులకు అధికారులు కొమ్ముకాస్తున్నారా? చర్యలు తీసుకోవాలి: కసిరెడ్డి భాస్కరరెడ్డి**

**క్రైమ్ మిర్రర్ హాఫీజ్‌పేట:** దీప్తిశ్రీనగర్‌లోని సర్వే నంబర్ 151లో ప్రభుత్వ శిఖం భూమిలో బై నంబర్లతో బహుళ అంతస్తుల నిర్మాణం చేపట్టడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు కొనసాగుతున్నా అధికారులు కేవలం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడంతో సరిపెట్టడంపై స్థానికంగా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయం తరపున సదరు భవనానికి హెచ్చరిక బ్యానర్ ఏర్పాటు చేశారు. నిర్మాణాలు కొనసాగిస్తే తెలంగాణ భూ ఆక్రమణ చట్టం--1905 ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. అయితే కేవలం హెచ్చరికలకే పరిమితం కాకుండా, ప్రభుత్వ భూమిని వెంటనే స్వాధీనం చేసుకుని అక్రమ నిర్మాణాలను తొలగించాలని జనం కోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కరరెడ్డి డిమాండ్



చేశారు. 1202 ం 374 గజాల చెరువు శిఖం భూమిని పూర్తిగా పరిరక్షించి, అక్కడ జరుగుతున్న నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని ఆయన కోరారు. ప్రభుత్వ భూముల విషయంలో అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని, కబ్జాదారులకు ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని ఆయన అన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం వహిస్తే ప్రజా ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని కసిరెడ్డి భాస్కరరెడ్డి హెచ్చరించారు.

# బాలిక చదువుకు మాజీ ఎమ్మెల్యే బాసట

**రామకృష్ణాపూర్ ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్):** తల్లిదండ్రులను కోల్పోయిన బాలిక చదువుకు చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు అండగా నిలిచారు. బాలిక 10వ తరగతి పూర్తయ్యే వరకు విద్యా ఖర్చులను తానే భరిస్తానని హామీ ఇచ్చారు. భగత్‌సింగ్‌నగర్‌కు చెందిన విజ్జిగిరి సతీష్--రజిత దంపతులు మృతిచెందడంతో వారి కుమార్తె అనాథగా మారింది. రెండేళ్ల క్రితం తల్లి రజిత, ఇటీవల తండ్రి సతీష్ మృతిచెందారు. ప్రస్తుతం పెద్దనాన్న సంరక్షణలో ఉంటున్న బాలిక చదువు కొనసాగించడం కుటుంబానికి భారంగా మారింది. ఈ విషయాన్ని స్థానిక కాంగ్రెస్ నాయకుడు గాండ్ల సమ్మయ్య మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు దృష్టికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న నల్లాల ఓదేలు శనివారం ఆల్ఫాన్సా పాఠశాలకు వెళ్లి యాజమాన్యంతో మాట్లాడారు. బాలిక 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు అయ్యే విద్యా ఖర్చులను భరిస్తానని తెలిపారు.




పాఠశాల ఫీజు కోసం ముందస్తుగా కొంత మొత్తాన్ని యాజమాన్యానికి అందజేశారు. బాలిక చదువుకు అండగా నిలిచిన నల్లాల ఓదేలును, సమస్యను ఆయన దృష్టికి తీసుకెళ్లిన గాండ్ల సమ్మయ్యను స్థానికులు అభినందించారు.

# కూకట్ పల్లి నియోజకవర్గానికి 10 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి అభివృద్ధి చేసిందేమీ లేదు

**కూకట్ పల్లి, ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్) :** పది సంవత్సరాలు శాసనసభ్యుడుగా ఉన్న కృష్ణారావు కూకట్ పల్లి నియోజకవర్గానికి చేసిందేమీ లేకపోగా స్థాయిని మించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చౌకబారు విమర్శలు చేస్తున్నాడని ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ తాము సహించబోమని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ తీవ్రస్థాయిలో హెచ్చరించారు. కృష్ణారావు హయాంలో నియోజకవర్గ పరిధిలోని చెరువులు నాళాలు కుంటలు మొత్తం కబ్జా చేశారని ఆయన ధ్వజమెత్తారు హస్మత్ పేట సర్వే నెంబర్ వన్ లో 100 ఎకరాలకు పది ఎకరాలు మిగిల్చారని అల్లాపూర్ లో నాలుగు ఎకరాలకు 2 ఎకరాలు, గోపాల్ నగర్లో 10 ఎకరాల ఖాళీ స్థలాన్ని కబ్జా చేసి కృష్ణారావు అతని అనుచరులు సొమ్ము చేసుకున్నారని రమేష్ విమర్శించారు. పిజెఆర్ హయాం నుంచి నేటి వరకు కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై టిఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధమని రమేష్ సవాల్ విసిరారు. మొదటిసారి కౌన్సిలర్ గా పోటీ చేసినప్పుడు నీ ఆస్తులు ఎంత ప్రస్తుతం మీ ఆస్తుల విలువ ఎంత అంటూ ఎమ్మెల్యే కృష్ణారావును ప్రశ్నించారు బండి రమేష్ శనివారం కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో బ్లాక్, డివిజన్ అధ్యక్షులతో కలిసి ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే టిఆర్ఎస్ పాలనపై నిప్పులు చెరిగారు. 22 ఏ విషయంలో కృష్ణరావు " ఉరి, హత్య, ఆత్మహత్య" అంటూ ప్రజల సానుభూతి కోసం నాటకాలు ఆడుతున్నాడని అతన్ని చంపాల్సిన అవసరం మాకు లేదన్నారు ముఖ్యమంత్రిపై విమర్శలు చేసే సమయంలో నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని రమేష్ కృష్ణారావును హెచ్చరించారు. హౌసింగ్ బోర్డ్ స్థలాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమ్ముకుంటుందన్న కృష్ణారావు విమర్శ పై రమేష్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు టిఆర్ఎస్ హయాంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములను విచ్చలవిడిగా అమ్ముకున్నారని అది నీకు కనిపించలేదా అని విమర్శించారు. రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంగా వారికి ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్తు, గ్యాస్, రేషన్ కార్డులు పంపిణీ, పెట్రోల్ బంకులు, బస్సులు, ఇందిరమ్మ ఇళ్లు కేటాయింపు వంటి ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. రానున్న ప్రతి ఎన్నికలను కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగురవేస్తుందన్నారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం ఫ్లైఓవర్లు అండర్పాస్ బ్రిడ్జిలు, లింకు రోడ్స్, స్కై వాక్ వంతెనలు నిర్మిస్తుందన్నారు. రాష్ట్ర ప్రజల వైద్యం కోసం రూ. 10 లక్షల బీమా సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. ప్రభుత్వం రాగానే 70 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిందని, విద్యా విధానంలో నూతన వరవడిని ప్రవేశపెట్టిందన్నారు.



# ఏలినో ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి!

**సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్**

**విద్య, వైద్య రంగాల సమస్యలు పరిష్కారం కోసం 31న కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయండి!**

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు**




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** ఎలీనో ప్రభావంతో నష్టపోయిన రైతులను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని సిపిఎం పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ డిమాండ్ చేశారు. స్థానిక ఖానాపురం హవేలీ సత్తెనపల్లి రామకృష్ణ భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యర్రా శ్రీనివాసరావు అధ్యక్షతన జరుగుతున్న పార్టీ జిల్లా విస్తృత సమావేశంలో భాగంగా 2వ రోజు ముఖ్య అతిథిగా హాజరైన పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వరి, పత్తి రైతులు బాగా నష్టపోయారని వారిని ఆదుకోవాలని ఆయన అన్నారు. వరి,పత్తి వెయ్యాల్సిన రైతులు ఇతర చిరుధాన్యాల పంటల వైపుకు వెళ్లారని, అక్కడ కూడా నష్టం జరుగుతుందని వారిని కూడా ఆదుకోవాలని అయన ఈ సందర్భంగా అన్నారు. ముఖ్యంగా రైతులు యూరియా సరిపడ అందకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు, యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవటం లేట్ అవుతుందని ఆయన అన్నారు. రైతులకు సరిపడా యూరియాను సొసైటీల ద్వారా అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల్ని ప్రభుత్వం ఆదుకోకపోతే తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా జిల్లాలో ప్రభుత్వ విద్యా, వైద్య సంస్థలలో సర్వే నిర్వహించినట్లు, విద్య వైద్య రంగాలే కాకుండా రేషన్ షాపులో కూడా సర్వేలు నిర్వహించినట్లు అయన తెలియజేశారు. వచ్చిన సమస్య లో కొన్ని సమస్యలు స్థానికంగా అధికారులు పరిష్కరించినట్లు ఆయన తెలియజేశారు. పరిష్కారం కానీ జిల్లా వ్యాప్తంగా వచ్చిన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31వ తేదీన కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ కు వినతి పత్రం ఇవ్వన్నట్లు ఆయన తెలియజేశారు. ఈ కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమానికి విద్యార్థులు, యువత, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్. కళ్యాణ వెంకటేశ్వరరావు, వై విక్రం. మాదినేని రమేష్. బొంతు రాంబాబు, భూక్య వీరభద్రం, బండి పద్మ .మెరుగు సత్యనారాయణ, మడుపల్లి గోపాల్ రావు, తదితరులు పాల్గొన్నారు.

# సిఈఐఆర్ పోర్టల్‌తో పోగొట్టుకున్న ఫోన్లు లభ్యం

**రూ.15 లక్షల 50 వేల విలువగల 98 మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేత**

**బాలానగర్ డివిజన్ ఏసీపీ నరేష్ రెడ్డి**



**బాలానగర్, ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్) :** బాలానగర్ ఏసీపీ డివిజన్ పరధిలోని బాలానగర్, అల్లాపూర్, కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు బాలానగర్ డివిజన్ పోలీసులు ఊరటనిచ్చారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి స్వాధీనం చేసుకున్న 98 మొబైల్ ఫోన్లను, దాదాపు రూ.15 లక్షల 50 వేలు ఉంటుందని, శనివారం ఏసీపీ నరేష్ రెడ్డి తన కార్యాలయంలో బాధితులకు స్వయంగా అందజేశారు. ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ నరేష్ రెడ్డి మాట్లాడుతూ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు ఏమాత్రం ఆందోళన చెందవద్దని, వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లోని సైబర్ హెల్ప్ డెస్క్‌ను సంప్రదించి ఫిర్యాదు చేయాలని సూచించారు. సిఈఐఆర్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా పోయిన ఫోన్ల వివరాలను నమోదు చేస్తే, సాంకేతిక పరిజ్ఞానంతో వాటిని త్వరగా గుర్తించి యజమానులకు అప్పగిస్తామని తెలిపారు. అనంతరం, సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించి ఫోన్లను రికవరీ చేసిన బాలానగర్ సీఐ ప్రశాంత్, అల్లాపూర్ సీఐ నవీన్ కుమార్, కూకట్ పల్లి సీఐ స్వామి గౌడ్, డీఐలు బానోత్ సక్రమ్, శేఖర్ రెడ్డి, క్రైమ్ టీమ్ ఏఎస్ఐ హనుమయ్య, కానిస్టేబుల్ లను ఇతర సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

# ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

**బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు**




**కూకట్‌పల్లి, ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్):** కూకట్‌పల్లి నియోజకవర్గం, కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో మాధవ్‌బాగ్ అడ్వాన్స్‌డ్ ఆయుర్వేద క్లినిక్స్ ఙ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా మెడికల్ క్యాంప్ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా మధుమేహం, గుండె సంబంధిత సమస్యలు, కొలెస్ట్రాల్, రక్తపోటు, థైరాయిడ్, అధిక బరువు వంటి జీవనశైలి సంబంధిత సమస్యలపై ప్రజలు ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ మెగా మెడికల్ క్యాంప్‌లో ఉచిత ల్యాబ్ పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, డైట్ సలహాలు, వ్యక్తిగత ఆయుర్వేద మార్గదర్శకత్వం, జీవనశైలి కౌన్సెలింగ్ వంటి సేవలను అందించడం పట్ల నిర్వాహకులను ఆయన అభినందించారు.ప్రజలకు ఆరోగ్య సేవలను మరింత చేరువ చేసేందుకు ఇలాంటి కార్యక్రమాలను భవిష్యత్తులో కూడా నిర్వహించాలని రాజేశ్వరరావు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు కుమారస్వామి, రఘురాం, మాధవ్ బాగ్ క్లినిక్ వారి సభ్యులు స్థానిక బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు పిలుపు మేరకు ఫీజుల బకాయిలు బిజెపి లడాయి అనే కార్యక్రమంతో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పతంగి రాజ్ భూపాల్ గౌడ్ శంషాబాద్ లో నిర్వహిస్తున్న నిరాహార దీక్షకు సంఘీభావంగా మహేశ్వరం నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి అందెల శ్రీరాములు, జిల్లా కార్యదర్శి దేవేందర్ రెడ్డి తో పాల్గొన్న జిహెచ్ఎంసి 59వ డివిజన్ జిల్లేలగూడ బిజెపి నాయకులు ఒంటేరు నరసింహారెడ్డి **(బాలాపూర్ బాలాపూర్)**

# ఎస్.టి.పి ప్లాంట్ నుంచి వస్తున్న దుర్వాసన...భారీ శబ్దాలతో ఇబ్బంది పడుతున్న స్థానిక ప్రజలు

**తక్షణమే సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**

**కూకట్ పల్లి, ఆగస్టు 29 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం, బాలాజీ నగర్ లోని రెయిన్బో విస్తా వద్ద ఎస్.టి.పి ప్లాంట్ ను శనివారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ప్రధానంగా ఆ చుట్టుపక్కల ప్రాంత ప్రజలు ఎస్.టి.పి ప్లాంట్ నుంచి వస్తున్న దుర్వాసన, భారీ శబ్దాలతో ఇబ్బంది పడుతున్న నేపద్యంలో అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఫతేనగర్, కెపిహెచ్బి ప్రాంతాల్లో నిర్మించిన ప్లాంట్ల వద్ద ఈ సమస్య లేదని ఇక్కడే ఎందుకు ఈ విధంగా వస్తుందో అధికారులు వెంటనే పరిశీలించి పరిష్కారం చూపాలని, లేనియెడల తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని సూచించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సమస్యను పరిష్కరించే దిశగా వెళ్లాలని ఏమైనా ఇబ్బంది ఉంటే తన దృష్టికి తీసుకురావాలని వీలైనంత త్వరగా సమస్యను పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, జనరల్ సెక్రటరీ వెంకటేష్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

